మట్టి పరీక్షలతో రైతుకు రక్ష

- భూసార ఫలితాలతో సత్ఫలితాలు
- ఎరువులు పెట్టుబడులు ఆదా
- మాచర్ల నియోజకవర్గంలో 3807,
- గురజాలలో 3530 పరీక్షలు లక్ష్యం



గురజాలలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

గురజాల: పల్నాడు ప్రాంతంలో అత్యధికంగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. పుడమి తల్లిపై భారం వేసి కష్టాలు నష్టాలు వచ్చినా వ్యవసాయం చేస్తున్నారు. గతంలో సీజన్ బట్టి వ్యవసాయం చేసే వారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం అభివృద్ధి చెందింది. అందుకు అనుగుణంగా సాగులో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ప్రధానంగా మట్టి నమూనా ద్వారా పంటల సాగు మంచి ఫలితాలను ఇస్తోంది. దీంతో ప్రభుత్వం భూసార పరీక్షలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి రైతులను ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టింది.

డివిజన్‌లో పరిస్థితి ఇలా...

డివిజన్‌లోని గురజాల, మాచర్ల నియోజకవర్గాలు ఉన్నాయి. గురజాలలో నాలుగు మండలాలు, మాచర్లలో ఐదు మండలాలు ఉన్నాయి. గురజాలలో 3530, మాచర్లలో 3807 మట్టి నమూనాలను సేకరించాలని లక్ష్యంగా వ్యవసాయ శాఖ పెట్టుకుంది. ప్రస్తుతం ఆయా శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి మట్టి నమూనాల కొరకు మట్టిని సేకరిస్తున్నారు.

వేసవి దుక్కుల సమయంలో..

వేసవి కాలం ఏప్రిల్, మే, జూన్ నెలలు వ్యవసాయ భూములు ఖాళీగా కనిపిస్తాయి. వేసవి దుక్కులు దున్నటం భూ యాజమాన్య చర్యలు చేపట్టడం వంటి పనులు చేస్తుంటారు. ఈ సమయంలో మట్టి నమూనాలు సేకరించి మట్టి పరీక్షలకు పంపి వచ్చిన ఫలితాల ఆధారంగా భూమిలో ఏ ఏ పోషకాలు లేకుండా పోయాయో తెలుసుకుని వాటిని భూ యాజమాన్య చర్యలు చేపట్టి మంచి దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

డివిజన్‌లోని వివరాలు..

మండలం	మట్టి నమూనాల లక్ష్యం	సేకరించినవి
గురజాల	1000	984
దాచేపల్లి	840	818
మాచవరం	840	782
పిడుగురాళ్ల	850	518
మాచర్ల	960	845
వెల్దుర్తి	800	678
దుర్గి	650	524
కారంపూడి	650	601
రెంటచింతల	773	747

మట్టి పరీక్షలు చేయించుకుంటే మంచిది



మట్టి పరీక్షలు నిర్వహించుకుని భూమిలో ఏ పోషకాలు తక్కువగా ఉన్నాయో తెలుసుకుని ఆ పోషకాల కోరకు తీసుకోవాల్సిన చర్యలు వ్యవసాధికారుల సలహా తీసుకుంటే మంచిది. ఇప్పటికే మట్టి నమూనాలు సేకరించడం జరిగింది. మెట్ట 5 ఎకరాలకు ఒక శాంపిల్, మాగాణి 2.5 ఎకరాలకు ఒక శాంపిల్ తీసి ల్యాబ్‌కు పంపించే పనిలో అధికారులు నిమగ్నమైయ్యారు. మట్టి పరీక్షలు నిర్వహించుకోవడం వలన లాభాలే కానీ నష్టాలు ఏ మాత్రం ఉండవు. రైతులు అధికారులకు సహకరించి మట్టి నమూనా పరీక్షలు నిర్వహించుకోవాలి.

–శ్రీ కృష్ణదేవరాయలు, పిడుగురాళ్ల ఏడీఏ

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



రోగుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవి రత్నాకర్

రెంటచింతల: స్థానిక పీహెచ్‌సీ కేంద్రానికి వివిధ రకాల వ్యాధులతో వచ్చే ప్రజలకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలను అందించాలని పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవి రత్నాకర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ కేంద్రాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ల్యాబ్‌లో ప్రజలకు నిర్వహిస్తున్న పరీక్షలను తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. రానున్న వర్షాకాలంలో దోమకాటు వలన మలేరియా ,ఫైలేరియా, చికెన్ గునియా, మెదడువాపు వచ్చే సీజన్ కాబట్టి ల్యాబ్ టెక్నిషీయన్లు కచ్చితంగా నిత్యం ఆస్పత్రిలో అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. మెడికల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బందికి తగు సలహాలు, సూచనలను ఎప్పటికప్పుడు అందిస్తూ ఉండాలన్నారు. ప్రస్తుతం పీహెచ్‌సీ పరిధిలో వస్తున్న జ్వరం కేసుల వివరాలను మెడికల్ ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు పీహెచ్‌సీకి వచ్చే రోగుల వివరాలు(ఓపి) నమోదు, ఆస్పత్రిలో రోగులకు ఆరోగ్య, ఆశ కార్యకర్తలు అందిస్తున్న సేవలు, రక్తపరీక్షల వివరాలు, మందులు ఇచ్చే విభాగం పనితీరు, వివిధ రికార్డులను పరిశీలించి తనిఖీ చేశారు. తొలుత గ్రామంలోని వివిధ సాంఘిక సంక్షేమ వసతి గృహాలను ఆయన సందర్శించి తలుపులకు, కిటికీలకు మస్కిటో మెషలను అమర్చుకోవాలని సూచించారు. త్వరలో విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో వసతి గృహాలలో మలాథియన్ స్ప్రేయింగ్ చేపట్టిన తీరును పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ హేమ, మలేరియా ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ అంకమ్మ రావు, సూపర్ వైజర్ ఎస్. కోటేశ్వరరావు, ల్యాబ్ టెక్నిషియన్ దుర్గారావు పాల్గొన్నారు.

సెయింట్ జోసఫ్స్ కరస్పాండెంట్‌గా ఫాదర్ బాలస్వామి



రెంటచింతల: స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల నూతన కరస్పాండెంట్‌గా, సెయింట్ థెరిసా వసతి గృహానికి రెక్టర్‌గా రె.ఫాదర్ గోవిందు బాలస్వామిని నియమిస్తూ గుంటూరు పీఠాదిపతులు డాక్టర్ సీహెచ్ భాగ్యయ్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ రె.ఫాదర్ పీటర్ పాపయ్య విధులు నిర్వహించారు. బాలస్వామి 1997లో స్థానిక కానుకమాత చర్చి అసిస్టెంట్ ఫాదర్‌గా, 2009 నుంచి 2017 వరకు స్థానిక సాగరమాత జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అండ్ కరస్పాండెంట్‌గా ఫాదర్ బాలస్వామి అంకితభావంతో సేవలు అందించారు. పల్నాడు ప్రాంతంలో పేద విద్యార్థులకు డిగ్రీ చదువులు అవసరాన్ని గుర్తించి ఆనాటి గుంటూరు పీఠాధిపతులుగా ఉన్న డాక్టర్ గాలిబాలి ఆశీస్సులతో విజడమ్ డిగ్రీ కళాశాల స్థాపనకు ఎంతో కృషి చేశారు. అనంతరం యూఎస్ఏలోని మిసోరి రాష్ట్రంలోని బెన్‌టన్ ఫ్యారీస్‌లో దైవసేవకులుగా పని చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ బాలస్వామి మాట్లాడుతూ 1949 స్థాపించిన సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల ఒక దేవాలయమని క్రమశిక్షణకు, విలువలకు మారుపేరుగా వెలుగొందుతుందన్నారు. 76 ఏళ్ల పాటు పల్నాడు ప్రాంతంలోనే కాకుండా రాష్ట్రంలో కూడా రెంటచింతల సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు.

అంకిత భావంతో విధులు నిర్వహించాలి

ఎంపీపీ సుహాసిని



మాట్లాడుతున్న ఎంపీపీ సుహాసిని

శావల్యాపురం: అధికారులు అంకిత భావంతో విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన పాలన అందించాలని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అన్నా రు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో గోకులం షెడ్లు నిర్మించి నెలల గడుస్తునా నేటి వరకు బిల్లులు మంజూరు కాలేదని ప్రజాప్రతినిధులు తీవ్రస్థాయిలో వాపోయారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుహాసిని మాట్లాడుతూ అర్హత కల్గియున్న లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా అధికారులు బాధ్యత వహించాలన్నారు. ఎంపీడీవో పేరుమీనా సీతా రామయ్య మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు వచ్చే నెల 21 వరకు జరుగుతాయని, మండల, గ్రామస్థాయిలో కమిటీల పర్యవేక్షణలో యోగా దినోత్సవం వేడుకలు నెలరోజుల పాటు జరుగుతాయన్నారు. యోగా చేయడం వల్ల కలుగు ప్రయోజనాలు ప్రజలకు అవగాహన కల్పించటంతో పాటు యోగాసా లు కూడా వేయించాలన్నారు. తహసీల్దారు యం.అర్జున్‌నాయక్ మాట్లాడుతూ నూతనంగా రేషన్ కార్డులు ప్రభుత్వం మంజూరు చేసిందని ఇప్పుటి వరకు మండలంలోని సచివాలయాల నుంచి ఆన్‌లైన్ ద్వారా 345 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అర్హత కల్గియున్న వారందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేస్తామన్నారు. ఎంఈవో మద్దికుంట సాంబశివరావు మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం నూతన విద్య విధానాలను అమలు చేసిందన్నారు. ఇందులో భాగంగా మండలంలోని పోట్లూరు ప్రైమరీ, హరిజన కాలనీ ఎంపీపీ స్కూలు, శావల్యాపురం, కనమర్లపూడి, కారుమంచి,మతుకుమల్లి ఆరు ఎంపీపీ స్కూలు ఎంపికైనట్లు తెలిపారు. 65 మంది విద్యార్థులు అధికంగా ఉన్న పాఠశాలలు గుర్తించగా ఒక్కో తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున కేటాయించారన్నారు.. 20 బేసిక్ ప్రైమరీ స్కూల్స్ ఎంపిక చేయగా విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులు నియామకం జరుగుతుందన్నారు. ఫౌండేషన్ స్కూల్స్ వయ్యకల్లు, పిచికలపాలెం ఎస్సీకాలనీల్లోని ఎంపీపీ స్కూల్స్ ఎంపిక చేశారన్నారు. సర్వసభ్య సమావేశానికి నామమాత్రంగా ప్రజా ప్రతినిధులు అధికారులు హజరు అయారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు చెన్నంశెట్టి రంగారావు, నంబూరి ప్రభావతి,ఏవో రామినేని రామారావు, ఏఈ జవ్వాజీ నటరాజ్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా నిలుద్దాం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పీఆర్కే



పీఆర్కేను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

మాచర్లరూరల్: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఎప్పుడూ అందుబాటులో ఉండి సేవలందించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కోరారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రధానకార్యదర్శిగా నియమితులైన పోతిరెడ్డి కోటిరెడ్డిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ హామీలిచ్చి ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, పార్టీ దుర్గి మండల అధ్యక్షుడు ఉన్నం పెద్దబ్బాయి, పార్టీ నాయకులు ఆరికట్ల పున్నారెడ్డి, ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, గోగిరెడ్డి హనిమిరెడ్డి, గుండెబోయిన పున్నయ్య, పాదం లచ్చయ్య, సాయినాయక్, ఆలేటి మహేష్‌బాబు, సురేష్‌బాబు, అప్పిరెడ్డి వెంకట నాగిరెడ్డి, రవికుమార్‌రెడ్డి, ఓరుగంటి ప్రతాప్‌రెడ్డి, పోతిరెడ్డి నాగిరెడ్డి పాల్గొన్నారు.

మాచర్ల: మాచర్ల నియోజకవర్గానికి చెందిన తాడి వెంకటేశ్వరరెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. మాజీ ఎమ్మెల్యే పీఆర్కే అభినందించారు.

24 నుంచి పెద్దింటమ్మతల్లి దేవాలయ వార్షికోత్సవాలు



అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న గ్రామ దేవత పెద్దింటమ్మ తల్లి దేవాలయ ప్రతిష్టా వార్షికోత్సవాలు ఈ నెల 24, 25 తేదీలలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాలయ వార్షికోత్సవ కార్యక్రమంలో 24వ తేదీన విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచామృత స్నపన, విషేష కుంకుమార్చన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అలాగే రెండవ రోజు 25వ తేదీ అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజల అనంతరం శ్రీలక్ష్మీగణపతి హోమం , రుద్ర హోమం శక్తిదుర్గాచండీ హోమం అనంతరం పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. 25న ఉదయం 11 గంటల నుంచి దేవాలయానికి వచ్చిన భక్తులందరికి అన్నసంతర్పణ జరుగుతుందని తెలియజేశారు. వార్షికోత్సవాలలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

జీఓ నంబర్ 4ను రద్దు చేయాలి

వీఆర్‌ఓల సంఘ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు



తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఓ సంఘ నాయకులు

మాచర్లరూరల్: వీఆర్‌ఓలకు పనిభారం పెంచి ఒత్తిడికి గురి చేసే జీఓ నంబర్ 4 పై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని వీఆర్‌ఓల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఆరుముళ్ల నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పని చేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులను క్లస్టర్ విధానంలో రేషనలైజేషన్ పేరుతో గ్రామ, వార్డు సచివాలయాల సెక్రటరీగా నియమిస్తూ జీఓను విడుదల చేసిందని, దీని వలన ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురి కావటమే కాకుండా పనిభారంతో ఇబ్బందిపడతారని చెప్పారు. అంతేకాకుండా ఈ క్లస్టర్ విధానం వలన 7,500 మంది గ్రామ రెవెన్యూ అధికారులను మిగులు సిబ్బందిగా చూపించి వారిని ఆందోళనకు గురి చేసే ప్రయత్నాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. మిగులు సిబ్బందిని ఏ శాఖలో సర్దుబాటు చేస్తారో, ఏ ప్రతిపాదనతో వారు పనిచేస్తున్న సచివాలయాలలో చూపించకుండా సర్వేయర్లను చూపించటానికి కారణమేమిటో చెప్పకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. రేషనలైజేషన్ ప్రక్రియలో క్లస్టర్ విధానం వలన జరుగుతున్న లోపాలను రెవెన్యూ ఉద్యోగులు రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు వ్యతిరేకిస్తున్నారని, ఈ లోపాలను సరి చేయాలని మంత్రులకు, చీఫ్ సెక్రటరీల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని చెప్పారు. రెవెన్యూ వ్యవస్థలో పనిభారంతో ఒత్తిడికి గురవుతున్న వీఆర్‌ఓలపై జీఓ నంబర్ 4ను తీసుకొచ్చి వారిని ఇబ్బందిపెట్టే ప్రక్రియను మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ మండల నాయకులు చిరంజీవి నాయక్, అనిల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ ఖాజావలి, అంజి, భాస్కర్, చంద్ర, గంగమ్మ, అనిత, రాజారావు పాల్గొన్నారు.

గో వధ చేసే వారిపై చర్యలు తీసుకోవాలి

విశ్వహిందూ పరిషత్ మండల ప్రముఖ్ మల్లారెడ్డి



అచ్చంపేట: గో వధ చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్– గో రక్ష విభాగ్, మండల ప్రముఖ్ తుమ్మా మల్లారెడ్డి కోరుతూ వివిధ గ్రామాల సర్పంచ్‌లకు బుధవారం విజ్ఞాపన పత్రాలు అందజేశారు. ఇందులో భాగంగా గోవధ నిషేధంపై గ్రామంలో మైకుల ద్వారా ప్రచారం చేయాలని, చాటింపు ద్వారా అందరికీ తెలియజేయాలని కోరుతూ పెదపాలెం సర్పంచ్ నెల్లూరి హరిబాబుకు వినతి పత్రం అందజేశారు. జూన్ 7న బక్రీద్ నాటికి అందరికీ అవగాహన కల్పించి గ్రామాలలో గో వధను పూర్తిగా నిషేధించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఉన్నతాధికారుల సహకారం కూడా కోరనున్నట్లు మల్లారెడ్డి చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నెల్లూరి చంద్రబాబు, ఆర్యవైశ్య సంఘ మాజీ అధ్యక్షుడు అన్నవరపు శ్రీనివాసరావు, డి.నగేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భక్తాంజనేయ స్వామి జయంత్యుత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో వేంచేసియున్న భక్తాంజనేయస్వామి దేవస్థానంలో హనుమత్ జయంత్యుత్సవ కార్యక్రమం రెండో రోజు బుధవారం స్వామి వారికి ఆలయ అర్చక స్వామి వేదాంతం విజయ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, హనుమత్ హోమం, విశేష పుష్పాలంకరణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తేనెటి వెంకటేష్, వెంకుబాయ్ దేవాలయానికి ఢమరుకాన్ని అందించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా తుమ్మల శ్రీపతి, కే బలరామకృష్ణ, వెంకటేశ్వర్లు, కృష్ణ సాయి, శివప్రసాద్, పవన్, వసుంధర, సుకన్య, ఉష ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవాలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ప్రతి ఒక్కరు భూములను రీ సర్వే చేయించుకోవాలి

తహసీల్దారు శ్రీనివాసయాదవ్

అచ్చంపేట: ప్రతి రైతు, ప్రతి భూ యజమాని తమ భూములకు సంబంధించి రీ సర్వే చేయించుకుని, హద్దులు వేయించుకోవాలని తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ కోరారు. మండలంలోని మాదిపాడులో బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమం, ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రీ సర్వే వల్ల భూ వివాదాలు తొలగిపోతాయని, భూములను డ్రోన్స్, జీపీఎస్ మిషన్స్ ద్వారా సర్వే చేయడం ద్వారా కచ్చితత్వమైన కొలతలు వస్తాయని చెప్పారు. అనంతరం గ్రామంలో రీ సర్వేపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మబాయి, ఆమె భర్త రమేష్ నాయక్, సర్పంచ్ మాదా ఈశ్వరమ్మ, ఆమె భర్త మాదా వెంకట్రావు, మండల సర్వేయరు ఏడుకొండలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



రెంటచింతలలో యోగాలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు



పిడుగురాళ్లలో యోగా చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీధర్



దాచేపల్లిలో జరిగిన యోగా దినోత్సవంలో మాట్లాడుతున్న వ్యక్తులు

రెంటచింతల: ప్రతి రోజు కొంత సమయం యోగా చేయడం వలన సంపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ కె.సరోజినిదేవి అన్నారు. బుధవారం ప్రిపేర్ నెస్ టు యోగ కార్యక్రమంలో భాగంగా స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు ఏర్పాటు చేసిన యోగాపై అవగాహన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం తరువాత ప్రతి ఒక్కరూ దినచర్యలలో యోగాను ఒక భాగం చేసుకుని మంచి పరిపూర్ణమైన ఆరోగ్యం పొందాలని కోరారు. అనంతరం తెనాలి రామకృష్ణ పర్యవేక్షణలో సచివాలయ, వివిధ కార్యాలయాల సిబ్బంది, ఎన్జీవోస్, విశ్రాంతి ఉద్యోగులు, ఉపాధ్యాయులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా ఆసనాలను సాధన చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ పిన్నం బ్రహ్మయ్య, వైఆర్ఎస్ హైస్కూల్ కరస్పాండెంట్ యేచూరి వెంకట సైదయ్య, కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షులు నారాయణపురం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రారంభమైన యోగాంధ్ర కార్యక్రమం

పిడుగురాళ్ల: యోగా ద్వారా ఎలాంటి ఆరోగ్య సమస్యనైనా రూపుమాపవచ్చునని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. పట్టణంలోని శ్రీవాసవీ కల్యాణ మండపంలో యోగాంధ్ర కార్యక్రయాన్ని బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... ఎన్నో శాశ్వత రుగ్మతలను యోగా ద్వారా కొంత వరకైనా నయం చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

మాచవరంలో...

మాచవరం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు యోగాపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంగళరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

దాచేపల్లి: యోగతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని డీఎల్‌డీఓ గబ్రూనాయక్ అన్నారు. ప్రపంచ యోగ దినోత్సవం బుధవారం నిర్వహించారు. నారాయణపురంలోని యోగ కేంద్రంలో జరిగిన ఈ వేడుకల్లో పలువురు వ్యక్తులు యోగ వలన కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. తహసీల్దార్ కేవీ కుటుంబరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో యోగకి ప్రత్యేకస్థానం కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ వైవీ అప్పారావు, ఎంఈఓ పినాకపాణి, యోగ గురువులు యర్రంశెట్టి గోపినాథ్, మురళీ, అంబటి చలమయ్య పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ పునః ప్రతిష్ట



పెదకూరపాడు : పెదకూరపాడు మండల పరిధిలోని జలాల్‌పురం గ్రామంలో వేంచేసి ఉన్న ఆంజనేయస్వామి ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్, లావణ్య దంపతులు ఆంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ నిర్వహణ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేపట్టారు. భక్తులు విశేషంగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

క్లుప్తంగా

మంచికల్లులో జెడ్పీ పాఠశాల ఫ్లెక్సీ ఆవిష్కరణ



రెంటచింతల: పల్నాడు కోనసీమగా పేరు పొందిన మంచికల్లులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మరో ఒక మెడల్ ప్రైమరీ స్కూల్‌ను ఏర్పాటు చేసి 12 మంది అర్హత కలిగిన ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం నియమించడం హర్షణీయమని సర్పంచి గోగుల పుల్లారెడ్డి అన్నారు. బుధవారం గ్రామంలో ఉన్నత పాఠశాల ఏర్పాటుకు సంబంధించిన ఫ్లెక్సీని గ్రామ పెద్దలు యరపతినేని మట్టయ్య, ఉపాధ్యాయులతో కలసి ఆవిష్కరించారు. మన గ్రామ విద్యార్థులు ముఖ్యంగా బాలికల బంగారు భవిష్యత్‌కు గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు, విద్యావేత్తలు, తల్లిదండ్రులు అందరం కలిసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ శిలార్ అహ్మద్, వీరబోయిన లింగం పాల్గొన్నారు.

మాచవరం ఎస్‌ఐగా రోశయ్య



మాచవరం: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా ఎం.రోశయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. రైల్వే పోలీస్ స్టేషన్లో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన సతీష్ సెలవుపై వెళ్లారు. ఈసందర్భంగా ఎస్‌ఐ ఎం .రోశయ్య మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని, అసాంఘిక కార్యక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటానని చెప్పారు. బ్యాధతలు చేపట్టిన ఆయనకు స్థానిక పోలీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పట్టణంలో భారీ వర్షం



మాచర్ల: పట్టణంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో వర్షం పడింది. పట్టణంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు వీధులన్నీ వర్షపునీటితో నిండిపోయాయి. బస్టాండ్‌లోపల గుంతల్లో వర్షపు నీరు చేరి ప్రయాణీలు ఇబ్బందులు పడ్డారు.

మరియదాసుకు పీఆర్కే పరామర్శ

మాచర్ల: అనారోగ్యానికి గురైన పట్టణంలోని 30వ వార్డుకు చెందిన ఆలేటి మరియదాసును వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బుధవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బి.సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లాప్రధాన కార్యదర్శి పి.కోటిరెడ్డి, పార్టీ దుర్గి మండల అధ్యక్షుడు ఉన్నం వెంకటేశ్వర్లు, ఎస్సీ సంఘ నాయకులు కె.మధు ఉన్నారు.

నేడు హనుమత్ జయంతి వేడుకలు



పెదకూరపాడు : మండల పరిధిలోని 75త్యాళ్ళూరులో కోదండరామాలయం వద్ద వేంచేసియున్న ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమత్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు తూములూరి శేషాచలపతి శర్మ, ఈఓ సత్యనారాయణ రెడ్డి, ధర్మకర్త కొల్లి పిచ్చిరెడ్డిలు బుధవారం తెలిపారు. గురువారం ఉదయం తోరణపాకు మహోత్సవంతో ప్రారంభించి, ఆంజనేయస్వామికి విశేష అభిషేకం, ఆకుపూజ జరుపనున్నట్లు వెల్లడించారు. ఉదయం 10 గంటలకు శాంతి కళ్యాణం, 11 గంటల నుంచి అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు హనుమత్ జయంతి వేడుకల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

అదృశ్యంపై కేసు నమోదు

క్రోసూరు: వృద్ధుడు మిస్సింగ్ కేసు మండలంలో నమోదయింది. క్రోసూరుకు చెందిన వృద్ధుడు షేక్ ఆదం షఫీ ఈ నెల 14వ తేదీ నుంచి కనబడటం లేదని అతని భార్య ఖాశింబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.రవిబాబు తెలిపారు. ఆదం షఫీకి 63 సంవత్సరాలుంటాయని, పక్షవాతం కారణంగా మాటలు సరిగా పలకలేదని, ఇంటి నుంచి నాలుగు రోడ్ల సెంటర్‌కు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదని ఎస్‌ఐ తెలియజేశారు. ఇప్పటి వరకు జాడ తెలియరాలేదని, ఆచూకి తెలిసిన వారు క్రోసూరు ఎస్‌ఐ ఫోను నెంబర్ 9440796235కు, పోలీసుస్టేషన్ 08640–227133 ఫోను చేయాలని ఆయన కోరారు.